# రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం

రెండోవపేజీ తరువాయి

దుక్కిదున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో చెప్పాలని అన్నారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు తెలుసు... ధాన్యం కొనుగోలు తెలియదని ఎద్దేవా చేశారు. బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హామీ కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు.

# విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

రెండోవపేజీ తరువాయి

బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం
## గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని 8 వ ఫ్లోర్ లో ఈ బాధ్యతలను చేపట్టారు.
శివధర్ రెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలన మరియు రహదారి భద్రత వంటి కీలక అంశాల్లో ఆయన తన అనుభవాలతో సాఫీగా కొనసాగేందుకు సహకరించనున్నారు. ఐపిఎస్ అధికారిగా 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ముఖ్యంగా, అంతర్గత భద్రత, మావోయిస్టులను జనజీవన ప్రవంతిలో చేర్చే కార్యకలాపాలలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించారు. గతంలో ఇంటిలిజెన్స్ విభాగంతో పాటు పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివధర్ రెడ్డి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్సర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు ఐపిఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి శ్రీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సిపి శ్రీమతి బి. సుమతి, ఐ జి పి (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ, పోలీసు విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ
## ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదు

**- రౌండ్ టేబులు సమావేశంలో కవిత**

ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాద్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేపపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. . రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.

## ప్రజాసంక్షేమం లక్ష్యంగా టిడిపి పాలన

ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయం కోసం టీడీపీ పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావంతోనే సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి జగన్ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. జగన్ చేసిన మోసాన్ని వైసీపీ నేతలే స్వయంగా ఒప్పుకున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విలువలు లేని పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు.

## రాహుల్, రేవంత్‌లపై వ్యాఖ్యలు

రెండోవపేజీ తరువాయి

నాలుగు విడతలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. కానీ, ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కేసీఆర్ పంట బోనస్ హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోంది. రైతు బంధు నిధుల్లో బీఆర్ఎస్ తీవ్ర జాప్యం చేసింది. మా ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసింది' అని మంత్రి సీతక్క తెలిపారు.

## ఇల్లంతకుంట మండల కేంద్రంలో ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణి చేసిన బెంద్రం.తిరుపతి రెడ్డి

మేకార్తి దినపత్రిక, మే 07 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



ఇల్లంతకుంట మండలనికి వచ్చే వేలాది మంది ప్రజలకు ఎండ తీవ్రత నుండీ ఉపశమనం కలిగించేందుకు చల్లని ఉచిత మజ్జిగ ద్వారా పంపిణీ చేస్తున్న బెంద్రం.తిరుపతి రెడ్డి మండల యువజన సంఘాల అధ్యక్షులు, నాయకులు ఫౌండేషన్ సేవా ప్రతినిదులు పయ్యావుల.నవీన్ గజ్జల శ్రీనివాస్ ఇల్లెంకి శ్రీను గౌరవేణి. శ్రీనివాస్ తదితర ప్రయాణికులు పాలుగోన్నారు.

## పొత్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు

మేకార్తి దినపత్రిక, మే 07 ప్రతినిధి



పెద్దపల్లి జిల్లా, ఓదెల మండలం, పొత్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు. పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, ఓ వ్యక్తి నుండి ఇంటి పర్మిషన్ కోసం ఫోన్‌పే ద్వారా 5 వేల రూపాయల లంచం తీసుకున్నట్టు ఆరోపణ. బాధితుని ఫిర్యాదు మేరకు పొత్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో, పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకొని, రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు.

# రైతుల కన్నీళ్లలో రేవంత్ కొట్టుకు పోవడం ఖాయం

రెండోవపేజీ తరువాయి

రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు రాబందు పాలన అని విమర్శించారు. రైతు కన్నీళ్లలో రేవంత్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. హనుమకొండలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బాగుండాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం ఆగమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్లలో వెయ్యి మంది రైతులు చనిపోయారని తెలిపారు. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలే అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ వరంగల్ అని తెలిపారు. బీఆర్ఎస్ సభ పెడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని అన్నారు. కేసీఆర్ జగిత్యాలలో మీటింగ్ పెడితే అదే సమయానికి రేవంత్ రెడ్డి మీటింగ్ పెట్టారని తెలిపారు. కానీ రేవంత్ సభ అట్టర్ ఎ÷-లాప్ అయ్యిందని విమర్శించారు. ఒక్క ఎకరానికి రైతు భరోసా వేసి అలయ్ బలయ్ చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులను పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతులకు కేసీఆర్ రూ.72వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. వరంగల్ జిల్లాలో చివరి భూముల వరకు కేసీఆర్ నీళ్లిచ్చారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని అన్నారు.

## ఐపీఎస్ సుమతికి వేధింపులు..
## పోకిరీలకు దిమ్మతిరిగే షాక్

రెండోవపేజీ తరువాయి

అనంతరం, దాదాపు 40 మంది పోకిరీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఐపీఎస్ అధికారిణినే ఇంత వేధించారు అంటే అత్యవసర పరిస్థితుల్లో అర్ధరాత్రి బయటకు వెళ్ళే సాధారణ మహిళల పరిస్థితి ఏంటి? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.
మల్కాజ్‌గిరి సీపీ సుమతి తన మార్క్ చూపించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో పోకిరీలకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. సీపీ సుమతి మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 3.30 వరకు స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా కామన్ లేడీలా అర్ధరాత్రి రోడ్డుపై నిల్చున్నారు. ఈ సందర్భంగా అధికారి సుమతిని పోకిరీలు చుట్టుముట్టారు. 'వస్తావా? రేటెంత?' అంటూ అసభ్య పదజాలంతో వేధించారు. దీంతో, దాదాపు 40 మంది ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, స్పెషల్ ఆపరేషన్‌లో పట్టుబడ్డ వారంతా విద్యార్థులు, ఉద్యోగార్థులు కావడం గమనార్హం. వీరిలో పలువురు గంజాయి మత్తులో ఉన్నట్లు సమాచారం. 40 మంది పోకిరీలకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని
## పట్టించుకోబోమంటే కుదరదు

రెండోవపేజీ తరువాయి

ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాద్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. "ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవే. వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలి.
తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా?" అని కవిత ప్రశ్నించారు.

## రైతులను ముంచి..
## ఇప్పుడు మొసలి కన్నీరు

రెండోవపేజీ తరువాయి

కేటీఆర్ వ్యాఖ్యలు 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉన్నాయని ఎద్దేవా చేశారు. బుధవారం జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సుపై నాయిని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక నకిలీ విత్తనాలు అమ్మే ముఠా అని, వారి హయాంలో 7 వేల మంది రైతులు
మరణించారని ఆయన గుర్తుచేశారు. రైతులపై ఎఫ్ఐఆర్ చేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని, రైతులను నట్టేట ముంచిన చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్‌ను అడ్డంపెట్టుకుని రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ మాట్లాడుతూ' స్క్రిప్ట్ రాసిస్తే చదవడం కాదు, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలి. రాహూల్ గాంధీని విమర్శించే స్థాయా నీది?. ఒకప్పుడు మీ
కుటుంబం సోనియా గాంధీ చుట్టూ తిరిగారు. కేటీఆర్ వెంట ఉన్న వాళ్లంతా దోపిడీదారులే.. నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి హనుమకొండ చౌరస్తాకు వస్తావా? రైతులను నట్టేట ముంచింది బీఆర్ఎస్. నా ప్రశ్నలకు కాదు, ముందు నీ చెల్లెలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వు' అని అన్నారు.

## హైదరాబాద్ మెట్రో
## ఫేజ్-2కు ఆమోదం

రెండోవపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ ,భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-ఎఎ కిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# గజ సింగవరం గ్రామంలో పశువుల పాకకు భూమి పూజ

మేకార్తి దినపత్రిక మే 7 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజ సింగవరం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈజీఎస్ ఉపాధి హామీ భాగంలో ఈరోజు పశువుల పాక కు సర్పంచ్ పాలకవర్గం భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమారెడ్డి విమల మాట్లాడుతూ ఉపదహామి భాగంలో అర్హులైన లబ్ధిదారులకు పశువుల పాక మరియు గొర్ల షెడ్లకు ఉపాధి హామీలో పనిలోభాగంగానిర్మించుకోవాలని సర్పంచ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్ ఏపిఎం అరుణ టెక్నికల్ అసిస్టెంట్ నవీన్ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనర్స్. మరియు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు

# చేర్యాలలో వ్యవసాయ మార్కెట్ దుకాణ సముదాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

మేకార్తి దినపత్రిక మే 07 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

చేర్యాల వ్యవసాయ మార్కెట్లో 20 దుకాణాల సముదాయాలను గురువారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ నల్ల నాగుల శ్వేత వెంకటా చారీ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మూడు సంవత్సరాల క్రితమే షాపుల నిర్మాణం ప్రారంభమైనప్పటికీ వివిధ కారణాలవల్ల ఆలస్యం జరిగిందన్నారు. అనేక అవరోధాలను దాటి సముదాయాలు ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ దుకాణాలను పూర్తిగా పారదర్శకంగా అర్హులైన వారికే కేటాయించాలని అధికారులను కోరారు. రాజకీయాలకు అతీతంగా, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం



చేశారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల నుండి అధిక సంఖ్యలో మొక్కజొన్న పంట వస్తుంది కనుక తడవకుండా వెంటనే లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. ప్రధానంగా రైతులు బస్తాలు అందుకోకపోవడం, దించేందుకు కూలీల కొరత ఉందని చెప్పారు. ఈ విషయమై తన కలెక్టర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరించిన కృషి చేస్తానని పేర్కొన్నారు. మార్కెట్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం

మార్కెట్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత వేంకటా చారి అన్నారు. గత కొద్ది రోజుల నుండి ఇతర ప్రాంతా మొక్కజొన్న పంట వస్తుందని, అధికారులతో మాట్లాడి లిఫ్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు కరెంటు జాలీలను ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామెడీ జీవన్ రెడ్డి, సభ్యులు ఆసర్ల అంజయ్య, అర్జుల పోసిరెడ్డి, వంగ కృష్ణ రెడ్డి, బైతి శ్రీనివాస్,ధరవత్ లక్ష్మి, సింగపాక కుమార్, చల్ల అండాలు, బండారి కనకయ్య, భాను ప్రకాష్, లక్ష్మీనారాయణ, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మేకార్తి దినపత్రిక, మే 06 చందుర్తి మండల రిపోర్టర్.

చందుర్తి మండల కేంద్రంలో గల సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది,ఇదే గ్రామానికి చెందిన పుల్లూరి భూమయ్య ఆలయాన్ని నిర్మించి ప్రతి సంవత్సరం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది, ఆలయ 34వ వార్షికోత్సవ సందర్భంగా భూమయ్య తనయుడు పుల్లూరి మల్లేశం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు,వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో గురువారం హోమం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు,ఈ సందర్భంగా ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు,ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, సాయిబాబా వార్షికోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులి సత్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి నాయకులు గోట్టే ప్రభాకర్, పులి సత్యం, బ్యాంకు తిరుపతి, దారం చంద్రం, పోతరాజు రవి, ఈశ్వర్, చిలుక భూమేష్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# హమాలీ కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలి..

**– తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో..**

మేకార్తి దినపత్రిక మే 07 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

ప్రభుత్వం నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కష్టపడి పనిచేస్తూ ధాన్యం బస్తాలను కాంటా నిర్వహిస్తూ లారీల్లోకి లోడు చేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో కోపరేటివ్ సొసైటీ నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో హమాలీ కార్మికుల తో మాట్లాడుతూ వారి ఇబ్బందులు తెలుసుకోవడం జరిగింది. ఏళ్ల తరబడి హమాలీ కార్మికులు అత్యంత కష్టతరమైన పని చేస్తూ ప్రభుత్వానికి తోడ్పాటు నందించినప్పటికీ ప్రభుత్వం హమాలీ కార్మికుల్ని గుర్తించటం లేదని దేశ అభివృద్ధిలో వీరి పాత్ర గణనీయ మైనప్పటికీ వీరిని గుర్తించడం లేదని హమాలీ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు అందించి ప్రతి హమాలీ కార్మికునికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వీరి కుటుంబానికి ఉచిత వైద్య ఆరోగ్య సౌకర్యాలు, పిల్లల చదువులలో తోడ్పాటు కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో హమాలీ కార్మికులను ఆదుకోవాలని



ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడారి నరేష్, జక్కు కనకయ్య , చిగుళ్ల నరసయ్య, కడారి మల్లయ్య ,భూమయ్య,ఆల్ల మల్లయ్య, మండే పల్లి కిషన్, తాటికొండ సంపత్, బైకన బీరయ్య, అయ్యాలం, కోమినేని రవి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**– అన్‌లోడింగ్ ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి**

మేకార్తి దినపత్రిక మే -07 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయడంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడం, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, తదితర అంశాలపై గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా శాఖ అధికారులు, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం అన్‌లోడింగ్



ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రతి రైస్ మిల్లుకు ఒక జీపీఓను కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ ప్రక్రియను తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. హమాలీలు అందరూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక బాధ్యులు ఉన్నారని, అధికంగా ధాన్యం సేకరణ జరిగే కేంద్రాల్లో అదనంగా ఒక అధికారిని కేటాయించాలని తహసీల్దార్లను ఆదేశించారు.రాబోయే వారం రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. వాహనాల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వాహనాల కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను తనిఖీ చేసి కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.మండల వ్యవసాయ అధికారులు వరి కోతలు సక్రమంగా జరిగేలా, ఎఫ్ఏక్యూ ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో ట్యాబ్ ఎంట్రీలు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం సంచులను మిల్లులకు పంపడంలో ఎటువంటి జాప్యం చేయవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

# గంభీరావుపేట తహసిల్దార్ కి వినతి పత్రం అందజేసిన ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు గంట శ్రీనివాస్

మేకార్తి దినపత్రిక, మే 07 గంభీరావుపేట్ మండల రిపోర్టర్



గంభీరావుపేటలో రైతులకు ట్రాన్స్పోర్ట్ విషయంలో ఇబ్బంది అవుతుందని తెలుపగా మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పంతులు సివిల్ సప్లై కమిషనర్ తో మాట్లా ఉండడం జరిగింది. లారి అసోసియేషన్ వాళ్ళతో మాట్లాడి గంభీరావుపేటలో ట్రాక్టర్లు నడపాలని ఎమ్మార్వో కు ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుల వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దానికి ఎమ్మార్వో, ట్రాక్టర్లలు పెట్టుకోమని ఎమ్మార్వో మరియు అసోసియేషన్ అధ్యక్షులు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిరామ అసోసియేషన్ అధ్యక్షులు గంట శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి మరవిని మహేష్, గౌరవ అధ్యక్షులు పెద్దవిని రాజ మల్లయ్య,ఇరవైని సత్యం,గంట రమేష్,ఎగదండి మహేష్, టేక్ మల్ల రాజు,తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ మాలలో ఉన్న యువకుడు కోనేరులో మునిగి మృతి

మేకార్తి దినపత్రిక మే 7 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో విషాదశీ గ్రామంలోని బుధవారం అర్ధరాత్రి హనుమాన్ దేవాలయం ముందున్న కోనేరులో పడి హనుమాన్ దీక్షలో ఉన్న యువకుడు మృతి చెందాడు మృతుడు కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అచ్చయ్య పల్లి గ్రామానికి చెందిన వినయ్ 16 సంవత్సరములు యువకుడు సిద్దిపేటలోని తన అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు ఈ క్రమంలోనే హనుమాన్ దీక్ష తీసుకున్న వినయ్ మరో ఎనిమిది మంది తోటి స్వాములతో కలిసి బుధవారం మల్లారెడ్డిపేటలోని హనుమాన్ ఆలయ దర్శనానికి వచ్చాడు ఆలయ ప్రాంగణంలోని కోనేరులో స్నానం చేసేందుకు దిగిన వినయ్ కు ఈత రాకపోవడంతో ఒక్కసారిగానీటిలోమునిగిపోయాడు గమనించిన తోటి వారు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది వినయ్ నీటిలో మునిగి ప్రాణాలు విడిచారు డెడ్ బాడీ ని సిరిసిల్ల ప్రభుత్వఆసుపత్రికితరలించినట్లు సమాచారం



# కాళ్లు, చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారెందరో ఉన్నారు

- చూపులేకపోయినా కోట్లాది జీవితాల్లో వెలుగులు నింపిన వారున్నారు
- శరీరంతో కాదు...మనసుతో గెలవండి
- అవయవ లోపం బలహీనత కాదు... మరో కోణంలో గెలిచే శక్తిగా భావించండి
- మీ పరిమితిని నిర్ణయించేది మీ శరీరం కాదు... మీ ఆత్మవిశ్వాసం
- దివ్యాంగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం మోదీ సర్కార్ ప్రాధాన్యతనిస్తోంది
- యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే దివ్యాంగులకు 3 రెట్ల బడ్జెట్ ను అధికంగా కేటాయిస్తున్నాం.
- భవిష్యత్తులో దివ్యాంగులందరికీ ఉపకరణాలు అందిస్తాం
- దివ్యాంగులకు సేవ చేయడం మహాభాగ్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- సిరిసిల్లలో 466 మంది దివ్యాంగులకు రూ.84 లక్షల విలువైన 813 ఉపకరణాలను అందించిన కేంద్ర మంత్రి



అవయవ లోపం అనేది బలహీనత కాదని, జీవితాన్ని మరో కోణంలో గెలిచే శక్తిగా భావించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. కాళ్లు, చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారెందరో ఉన్నారు. కంటి చూపు లేకపోయినా కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపి ఎంతో మంది దివ్యాంగులు స్ఫూర్తినిచ్చారని చెప్పారు. దివ్యాంగులకు సేవ చేయడం మహాభాగ్యమని అన్నారు. అందులో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే దివ్యాంగుల కోసం రూ.100 కోట్లకుపైగా వెచ్చించి ఉపకరణాలు అందించామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. దివ్యాంగుల అభ్యున్నతికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందన్నారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే అత్యధిక నిధులు కేటాయిస్తోందన్నారు. ఈరోజు సిరిసిల్ల పట్టణంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఆర్థిక సహకారంతో ఈరోజు సిరిసిల్ల పట్టణంలో 466 మంది దివ్యాంగులకు రూ.84 లక్షల విలువైన 813 ఉపకరణాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఐఓసీఎల్ సీజీఎం వినీత్ కౌర్, జడ్పీ సీఈవో, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డీఆర్డీవో పద్మయ్య, అలీం కో టీం ప్రతినిధి చందన్, దివ్యాంగుల యూనియన్ నాయకుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే... పథకాల కింద సిరిసిల్ల జిల్లాలో ఈరోజు 84 లక్షల కేంద్ర నిధులతో 466 మంది దివ్యాంగులకు 813 పరికరాలను కొనుగోలు చేసి దివ్యాంగులకు అందజేయడం సంతోషంగా ఉంది. గతంలో కరీంనగర్ లో, వేములవాడలో కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పెద్ద ఎత్తున పరికరాలను పంపిణీ చేసిన విషయం మీ అందరికీ తెలిసిందే. త్వరలోనే దివ్యాంగులందరికీ ఉపకరణాలు అందిస్తాం.ఇవి మాత్రమే కాకుండా మహిళలు, పిల్లలు, వృద్దుల కోసం కేంద్రం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. అంగన్ వాడీ కేంద్రాల్లో బాలామృతం, గుడ్డు సహా పిల్లలకు అందించే పోషకాహారం కేంద్ర నిధులతో అందిస్తున్నారు. గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం, గడ్లు, పాలుసహా అన్నింటికీ కేంద్రమే నిధులిస్తూ గర్భిణీ మహిళలు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా ఆరోగ్యవంతంగా జీవనం కొనసాగేలా చేస్తోంది. వృద్దులకు, దివ్యాంగ ఆశ్రమాలకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులను విడుదల చేస్తూ వారి జీవనానికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటోంది. నా పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు గర్భిణీ మహిళలు, పిల్లలు, వృద్దులు, దివ్యాంగుల సంక్షేమం కోసం దాదాపు 100 కోట్లను కేంద్రం ఖర్చు చేసింది. కేంద్రం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నా.. అన్ని అవయవాలున్న వాళ్లే అనేక ఇబ్బందులు పడుతున్నారు... ఇక దివ్యాంగుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. అందుకే వారు ఇబ్బందులను అధిగమించేలా చేసేందుకు మోదీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా 466 మంది దివ్యాంగులకు 813 పరికరాలను ఈరోజు ఉపకరణాలు అందిస్తున్నాం. రానివాళ్లు బాధపడాల్సిన పనిలేదు. ఎంతమంది దరఖాస్తు చేసుకుంటే అంతమందికి అతి త్వరలో ఉప కరణాలు అందిస్తాం. గత 12 ఏళ్లుగా దివ్యాంగుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం , కేంద్ర సామాజిక సాధికారత శాఖ ద్వారా వేలాది కోట్లను దివ్యాంగుల కోసం ఖర్చు చేస్తోంది. ఈ ఒక్క ఏడాదే రూ.1600 కోట్లు కేటాయించింది. గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే 3 రెట్ల బడ్జెట్ ను అధికంగా కేటాయిస్తున్నారు. దివ్యాంగులకు ఉపకరణాలను అందజేయడంతోపాటు విద్య, ఉపాధి, డిజిటల్ ఐడీ, యాక్సెసిబుల్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. వారి హక్కులను కాపాడటంలో ముందున్నాం.దివ్యాంగ సోదరులకు నేను చెప్పేదొక్కటే... మనిషి శరీరంతో కాదు...మనసుతో గెలుస్తాడు. చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారెందరో ఉన్నారు...కాళ్లు పనిచేయకపోయినా ప్రపంచాన్ని జయించినవారు ఉన్నారు. కళ్లలో వెలుగు లేకపోయినా కోట్ల మందికి దారి చూపినవారు ఉన్నారు. అవయవ లోపం అనేది బలహీనత కాదు. అది జీవితాన్ని మరో కోణంలో గెలిచే శక్తిగా భావించండి. సమాజం కొన్నిసార్లు మిమ్మల్ని "పరిమితులు ఉన్నవారు"గా చూడొచ్చు. కానీ "మీ పరిమితిని నిర్ణయించేది మీ శరీరం కాదు... మీ ఆత్మవిశ్వాసం."జీవితంలో మీకు ఎన్నో ఇబ్బందులు ఎదురైనా ఇంతవరకు వచ్చారు అంటే... మీరు సాధారణ మనుషులు కాదు. ప్రతి ఉదయం మీరు చేసే పోరాటం. చాలామందికి జీవిత పాఠం. మీ చిరునవ్వు వెనుక బాధ ఉండొచ్చు. కానీ ఆ బాధను జయించే ధైర్యం కూడా మీలోనే ఉంది. మీరు ఉద్యోగాలు చేయగలరు. వ్యాపారాలు నిర్మించగలరు... కళల్లో, క్రీడల్లో, విద్యలో, టెక్నాలజీలో అద్భుతాలు చేయగలరు. గుర్తుంచుకోండి...ఓటమి శరీరంలో కాదు... మనసులో మొదలవుతుంది. మీరు మీపై నమ్మకం పెంచుకున్న రోజునుంచి జీవితం మారిపోతుంది. కాబట్టి ఒక్కటి గుర్తుంచుకోండి "మీరు ఎవరికీ తక్కువ కాదు. మీ జీవితానికి మీరే హీరో. మీ అడుగులు నెమ్మదిగా ఉండొచ్చు. కానీ మీ గమ్యం గొప్పది కావాలి. మీరు నిలబడితే ఇంకో దివ్యాంగుడికి ధైర్యం వస్తుంది. "అవయవ లోపం విజయానికి అడ్డంకి కానే కాదు... ఆత్మవిశ్వాసం ఉంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపించిన వీరులు వీరంతా... వారి స్ఫూర్తితో ముందుకు సాగండి. దేవుడు మీ జీవితంలో ఒక తలుపు మూసివేసి ఉండొచ్చు... కానీ మీలో అసాధారణమైన శక్తి అనే మరో తలుపు తప్పకుండా తెరిచాడు. ఆ శక్తిని నమ్మండి. ముందుకు సాగండి. ప్రపంచం మీ విజయాన్ని చూసే గర్వించే రోజులు ఎంతో దూరంలో లేవు.

# మాజీ ఎమ్మెల్యే కట్టకం మృత్యుంజం పంతులకు ఘనంగా సన్మానం

శ్రీ సాయి శ్రీరామ ట్రాక్టర్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు గంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో



మేకార్తి దినపత్రిక మే 07 గంభీరావుపేట్ మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని శ్రీ సాయి శ్రీరామ ట్రాక్టర్ యూనియన్ ద్వారా మాజీ ఎమ్మెల్యే శ్రీ కటకం మృత్యుంజయం పంతులు( ఈరోజు ట్రాక్టర్ లు ఏవిధంగా నడపడానికి పలు సూచనలు చేశారు సివిల్ సప్లై కమిషనర్ హైదరాబాద్ గారితో మాట్లాడడం జరిగింది శ్రీ కటకం మృత్యుంజయం ఎమ్మెల్యే గారికి శ్రీ సాయి శ్రీరామ మా యూనియన్ తరపున కృతజ్ఞతలు సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గంట శ్రీనివాస్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి ప్రధాన కార్యదర్శి మరవేని మహేష్ గంట రమేష్ చిట్టెంపల్లి రాజు గౌరవాధ్యక్షులు పెద్దవిని రాజ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 6న మలేషియాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు



మేకార్తి దినపత్రిక మే 07 ప్రతినిధి

బీఆర్ఎస్ మలేషియా ఆధ్వర్యంలో జూన్ 6, 2026న కౌలాలంపూర్‌లోని మాట్రేడ్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మలేషియా ప్రతినిధులు మారుతి కుర్మా, చిట్టిబాబు, శ్రీధర్, ప్రియ తదితరులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారిని కలిసి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ ఆహ్వానాన్ని కేటీఆర్ గారు స్వీకరించి, జూన్ 6న మలేషియాలో జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు హాజరవుతున్నట్లు ధృవీకరించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కూడా పాల్గొన్నారు.తెలంగాణ మరియు తెలుగు ప్రజలను ఒక వేదికపైకి తీసుకువచ్చి, ఈ చారిత్రాత్మక వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ మలేషియా విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

# కొండగట్టులో హనుమాన్ పెద్ద జయంతి వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్ ఐపీఎస్.....
భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి.



మేకార్తి దినపత్రిక మే 07 ప్రతినిధి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టులో ఈ నెల 10 నుండి 13 వరకు నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్ ఐపీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.జయంతి వేడుకల సందర్భంగా వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, మాలవిరమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, వాహనాల రాకపోకలు జరిగే మార్గాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు.అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ఎలాంటి నేరాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# గన్నేరువరం కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

- అధికారుల నిర్లక్ష్యం వర్షంలో తడిసిన వడ్ల బస్తాలు
- నిర్లక్ష్యంగా నడుస్తున్న కొనుగోలు కేంద్రం



మేకార్తి దినపత్రిక (మే 7) గన్నేరువరం మండల ప్రతినిధి

గన్నేరువరం మండల కేంద్రంలో వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన వడ్లు భారీ వర్షానికి పూర్తిగా తడిసిపోయి నేలమట్టమయ్యాయి కష్టపడి పండించిన పంట కళ్ళముందే నీటి పాలవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు తెలిపిన వివరాల ప్రకారం కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి ధాన్యం సకాలంలో తరలింపు కాకపోవడంతో వడ్లు రోజుల తరబడి కేంద్రంలోని పేర్కపోయాయి ఇప్పటివరకు కేవలం ఎనిమిది లారీల ధాన్యం మాత్రమే తరలించగా మిగిలిన ధాన్యం అక్కడే ఉండిపోయిందని తెలిపారు కురిసిన అకాల వర్షం ధాన్యాన్ని పూర్తిగా తడిపేసిందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన టార్పిలిన్ రక్షణ చర్యలు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆరోపిస్తున్నారు వర్షం సూచనలు ఉన్నప్పటికీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని మండిపడుతున్నారు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించిన ధాన్యం ఇలా నష్టపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే అధికారులు సందర్శించి రైతులను ఆదుకోవాలని అన్నారు.



# పరలోక ఆశీర్వాదం పండుగలు

సిరిసిల్ల, మే 6, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

సిరిసిల్ల పట్టణం పెద్దబోనాల రోడ్డులో గల హెవెన్లీ ఫైర్ ప్రార్థన మందిరంలో 6.7 బుధవారం గురువారం సాయంత్రం 6: నుండి 15 వ వార్షిక పరలోకపు ఆశీర్వాదం పండుగలు జరుగును ఈ ప్రార్థనలో పాస్టర్ జేమ్స్, భద్రాచలం వైజాగ్ టోనీ, హైదరాబాద్ విరు ఏసుక్రీస్తు యొక్క బోధను బోధించెదరు దూర ప్రాంతాల నుండి వచ్చే వారికి భోజన సదుపాయం కలదు అందర్నీ ఆహ్వానిస్తున్నామని కన్వీనర్ పాస్టర్ మనోహర్ గారు ఒక ప్రాంతంలో తెలిపారు ఇట్టి ప్రార్థన కూడికలకు అందరూ ఆహ్వానితులే దయచేసి అందరూ రాగలరని ప్రార్థన

# మీ ప్రేమకు కృతజ్ఞతలు..

## అది నా హ్యాపీ ప్లేస్: త్రిష పోస్ట్ వైరల్



కొన్ని రోజులుగా త్రిష పేరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న విషయం తెలిసిందే. సోమవారం ఆమె పుట్టినరోజు కావడంతో అభిమానులు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకున్నారు. ఇంతమంది ప్రేమను పొందినందుకు ఎంతో ఆనందంగా ఉందని తాజాగా త్రిష ఇన్‌స్టా స్టోరీలో పెట్టారు. "మీ అందరూ నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు. మీరు చూపిస్తున్న ఈ అపారమైన ప్రేమకు కృతజ్ఞతలు. వినమ్రంగా ఉంటాను" అని తన స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇక తన పుట్టినరోజు నాడు త్రిష తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వీడియోలు కూడా వైరలయ్యాయి. దర్శనానికి వెళ్తున్న ఓ వీడియోను షేర్ చేసిన ఆమె.. తిరుమల తన హ్యాపీ ప్లేస్ అని పేర్కొన్నారు.ఆమె పుట్టినరోజు సందర్భంగా పలువురు సెలబ్రిటీలు పెట్టిన విషెస్ నెటిజన్లను ఆకట్టుకున్నాయి. నటి రాధిక కూడా 'హ్యాపీ బర్త్‌డే.. వాట్ ఏ గిఫ్ట్' అంటూ లవ్ ఎమోజీలు జోడించారు. అలాగే ఇది నీకు బెస్ట్ బర్త్‌డే అని వరలక్ష్మి శరత్‌కుమార్ పేర్కొన్నారు. 'ఈ పుట్టినరోజు చిరస్థాయిలో నిలిచిపోతుంది' అని చార్మి విష్ చేశారు. యూనివర్స్ నీకు మంచి గిఫ్ట్ ఇచ్చిందని మంచు లక్ష్మి అన్నారు. ఇక మే 4న తమిళనాడు ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. విజయ్ టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టిస్తూ 234 స్థానాల్లో 108ని కైవసం చేసుకుంది.

# సూపర్ హీరోతో కరీనా?




'క్యోం కీ', 'మై ఔర్ మిసెస్ ఖన్నా', 'బజరంగీ భాయ్‌జాన్' లాంటి విజయవంతమైన చిత్రాలతో హిట్ జోడీ అనిపించుకున్నారు బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్ ఖాన్, కథానాయిక కరీనా కపూర్. ఇప్పుడీ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతున్నట్లు తెలుస్తోంది. రాజ్ అండ్ డీకే రూపొందిస్తున్న ఓ చిత్రంలో సల్మాన్ సూపర్ హీరోగా నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో నాయికగా కరీనాను ఎంపిక చేసిందట చిత్రబృందం. "ఇందులోని పాత్ర కోసం కరీనాను స్వయంగా సంప్రదించారు సల్మాన్. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో నటించడానికి కరీనా చాలా ఉత్సాహంగా ఉంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంద"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

**ఇప్పుడీ చిత్రంలో నాయకగా కరీనాను ఎంపిక చేశిందట చిత్రబృందం.**

"ఇందులోని పాత్ర కోసం కరీనాను స్వయంగా సంప్రదించారు సల్మాన్. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో సటించడానికి **కరీనా చాలా ఉత్సాహంగా ఉంది.** అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.



# సల్మాన్ ఖాన్ - వంశీ సినిమాలో విలన్.. రేసులో ఈ ఇద్దరి పేర్లు!

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి సినిమా తీయనున్న విషయం తెలిసిందే. 'ఎస్‌వీసీ63' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. ఈ కండల వీరుడితో ఢీ కొట్టేందుకు విలన్ పాత్ర కోసం ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి.మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఏమాత్రం తగ్గకుండా నటనలో ఆయనకు గట్టి పోటీ ఇచ్చే విలన్ ఉండాలని చిత్ర బృందం భావిస్తోందట. అందుకే ఈ ఇద్దరిలో ఒకరిని ఫైనల్ చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయి.ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో సల్మాన్‌కు జోడీగా అగ్ర కథనాయిక నయనతార నటిస్తుండగా.. సీనియర్ నటుడు అరవింద్ స్వామి ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబయిలో దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నయనతార కూడా ఈ తాజా షెడ్యూల్‌లో పాల్గొన్నారు. సల్మాన్ ఖాన్ మాస్ ఇమేజ్‌కు వంశీ పైడిపల్లి స్టైలిష్ టేకింగ్ తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

# యజమాని కోసం ఇల్లు ఎదురుచూపు



ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ 'ది ఒడిస్సీ' చిత్రంతో ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో టామ్ హాలెండ్, మాట్ డామన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జులై 17న థియేటర్లలోకి రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "యజమాని కోసం ఎదురు చూస్తున్న ఇల్లు ఇది', 'ఇథాకా రాజు తిరిగి వస్తున్నాడు" లాంటి సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతోందీ ట్రైలర్.

# బాలకృష్ణ సరసన బాలీవుడ్ అందం?



కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు కొరటాల శివ కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే దీనిపై అధికారిక ప్రకటన వచ్చేసింది. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభించేందుకు తెర వెనుక సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇందులో కనిపించనున్న తారాగణమెవరన్నది ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఓ ఆసక్తికర వార్త బయటకొచ్చింది. ఇందులో బాలకృష్ణకు జోడీగా ఓ బాలీవుడ్ నాయికను రంగంలోకి దించే అవకాశమున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే విద్యాబాలన్‌తో పాటు మరో నటి పేరు ప్రచారంలో ఉంది. విద్యా ఇప్పటికే బాలయ్యతో కలిసి 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎన్టీఆర్ మహానాయకుడు' చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ జోడీ మళ్లీ కొరటాల శివ సినిమాతో తిరిగి కలిసిందంటే.. దీనిపై ఉత్తరాదిలోనూ మంచి అంచనాలేర్పడే అవకాశముంది. ఇది బలమైన సామాజిక సందేశమున్న యాక్షన్ కథతో రూపొందనుందని.. దీంట్లో రాజకీయ అంశాలు మిళితమై ఉంటాయని తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# అప్పుడే మంచి కథల కోసం వెతకడం మానేశా!



పేరుకి తగ్గట్టే తొలి సినిమాతోనే ఫేమస్ అయిన కథానాయకుడు... సుమంత్ ప్రభాస్. 'మేమ్ ఫేమస్' సినిమాతో కథానాయకుడిగా, దర్శకుడిగా పరిచయమైన ఆయన... తన రెండో చిత్రంగా 'గోదారి గట్టుపైన' చేశారు. 'ఈ వేసవిలో కూల్ అయిపోండి...' అంటూ ప్రచార జోరుని కొనసాగిస్తున్నాడు. సుభాష్‌చంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

**▪ రెండో సినిమాని చాలా సమయం తీసుకుని చేసినట్టున్నారు...**

'మేమ్ ఫేమస్' తర్వాత మరొక సినిమా చేయాలనుకున్నప్పుడు 'తొలి సినిమాతోనే నీకు మంచి గుర్తింపు వచ్చింది కదా. రెండో సినిమానీ మంచి కథతో చేయి' అని సలహా ఇచ్చారు చాలామంది. అలా చాలా కథలు విన్నా. ఒక దశలో ఎలాంటి కథ చేయాలో తెలియక ఒత్తిడి పెరిగింది. అప్పుడే మంచి కథలు వెతకడం మానేసి, ఒక మంచి దర్శకుడితో జట్టు కడితే బాగుంటుందనుకున్నా. ఆ క్రమంలోనే వంద లఘు చిత్రాలు తీసిన అనుభవం ఉన్న సుభాష్ అన్నని కలిశా. ఆయన చెప్పిన ఈ కథ నచ్చి సినిమా చేశా.

**▪ మీలోనూ ఓ దర్శకుడు ఉన్నాడు కదా. రచన, దర్శకత్వం పరంగా మీ భాగస్వామ్యం ఏమైనా ఉందా?**

కథ వినగానే 'నేను మీకు లొంగిపోతున్నా...' అని దర్శకుడితో చెప్పా. ఆయన ఈ కథని పకడ్బందీగా రాసుకుని, తనదైన శైలిలోనే తెరపైకి తీసుకొచ్చారు. సినిమా పూర్తయ్యాక ప్రచారం బాధ్యతల్ని మాత్రం నాకు వదిలేయండి అని చెప్పా(నవ్వుతూ). నా తొలి సినిమా కోసం ఎలా ప్రచారం చేశామో, అలా ఈ సినిమానీ ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలని 'కూల్...' అంటూ నేనే స్వయంగా ప్రచార చిత్రాల్ని డిజైన్ చేశా. అందులో కృత్రిమ మేథనీ వాడుకుంటున్నాం.

**▪ 'గోదారి గట్టుపైన' కథలో మిమ్మల్ని ప్రధానంగా ఆకట్టుకున్న విషయాలేమిటి?**

గోదావరి నేపథ్యంలో సాగే అందమైన ఈ కథ, భావోద్వేగాలే నన్ను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. తొలి సినిమా తెలంగాణ నేపథ్యంలో సాగుతుంది. ఈసారి అందుకు భిన్నమైన నేపథ్యం కావడంతో నటుడిగా నాకు సవాల్‌గా అనిపించింది.

**▪ గోదావరి యాస విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకొన్నారు?**

నేను పుట్టి పెరిగింది తెలంగాణలో. పక్కాగా అయితే గోదావరి యాసలో మాట్లాడలేను. అక్కడ పుట్టి పెరిగినవారు నా యాస విన్నప్పుడు 'మనలా మాట్లాడేందుకు ప్రయత్నించాడు' అనుకున్నా చాలు. యాస కోసం నాలుగు నెలలపాటు సన్నాహాలు చేసి ఇందులో నటించా. కచ్చితంగా నా ప్రయత్నం ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నా. ఇందులో నేనొక ఆటోడ్రైవర్‌గా కనిపిస్తా.

**▪ జగపతిబాబు, లైలా తదితర సీనియర్ నటులు ఇందులో ఉన్నారు కదా. వాళ్లతో పనిచేసిన అనుభవం ఎలా ఉంది?**

చాలా రోజుల తర్వాత జగపతిబాబు ఆయన నటించిన 'శుభలగ్నం', 'ఫ్యామిలీ సర్కస్' సినిమాల్ని గుర్తు చేసేలా అందమైన పాత్రని ఇందులో చేశారు. ఆయనకు జోడీగా ఒకప్పటి కథానాయిక లైలా నటించారు. వాళ్లిద్దరి కలయిక ప్రత్యేకంగా అనిపిస్తుంది. జగపతిబాబు తనతో కలిసిపోవాలని నన్ను భీమవరంలో సినిమాకీ, బజ్జీలు తినడానికీ తీసుకెళ్లేవారు. దర్శకుడు, నటుడు దేవీప్రసాద్ కూడా ఇందులో కీలకపాత్రని చేశా. నిర్మాత అభినవ్ దర్శకుడికి పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఏ విషయంలోనూ రాజీపడకుండా సినిమా చేశారు.

**▪ నటనపైనే దృష్టిపెడతారా? మళ్లీ మీ దర్శకత్వంలో సినిమా ఎప్పుడు?**

దర్శకత్వం చేయకూడదనేమీ లేదు. ఇప్పుడు కూడా స్క్రిప్ట్ రాసుకుంటున్నా. అయితే నేను కథానాయకుడిగా ఇప్పటికే మూడు సినిమాలకి సంతకం చేశా. అందులో ఒక సినిమా చిత్రీకరణ కూడా పూర్తయింది. ఈ ప్రయాణం మధ్యలో నాకు సమయం దొరికితే కచ్చితంగా దర్శకత్వం చేస్తా.



# సూర్య వీరభద్రుడు మూవీకి U/A సర్టిఫికేట్.. మే 14న తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్

సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్‌ఆర్ ప్రకాష్ బాబు, ఎస్‌ఆర్ ప్రభు నిర్మించిన తమిళ చిత్రం 'కరుప్పు'. తెలుగులో 'వీర భద్రుడు' టైటిల్‌లో విడుదలవుతోంది. తాజాగా ఈ మూవీ సెన్సార్ పూర్తిచేసుకుని యూ/ఏ సర్టిఫికేట్ అందుకుందని మేకర్స్ తెలియేశారు. మే 14న తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్‌కు రెడీ అవుతోంది. త్రిష హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ రవి కీలక పాత్రలు పోషించారు. సాయి అభ్యంకర్ సంగీతం అందించాడు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, టీజర్ సినిమాపై బజ్‌ను పెంచాయి

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com